
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

సోమవారం 26 ఆగస్టు 2024

జిల్లాల వార్తలు



రక్తమోడిన రహదారులు

● వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

4 కిలోమీటర్లు.. 16 మలుపులు

● ప్రమాదకరంగా తేర్పోల్ కొండాపూర్ రోడ్డు

● దారిపొడువునా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు

7

'భగీరథ' నీరు బంద్రై.. చెరువు నీరే దిక్కయి..!



నడి వానాకాలంలో నీటి ఎద్దడి వేధిస్తున్నది. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని మేడికుంద గిరిజన తండాకు పదిహేను రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయింది. తండాలో ఉన్న బోరులో మురుగు కలుస్తుండడంతో దాహార్తిని తీర్చుకునేందుకు చెరువు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. తాగునీరు రావడం లేదని డీఈకి విన్నవిస్తే నీళ్లు వచ్చినప్పుడే దాహార్తి తీర్చుకోవాలని బదులిచ్చారని తండావాసులు వాపోతున్నారు. అసలే వ్యాధుల కాలం.. చెరువు నీటిని తాగుతుండడంతో రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

-వట్‌పల్లి





మెదక్‌లో మెడికల్ కాలేజీ ఏర్పాటుపై ప్రతిష్టంభన తొలగడం లేదు. కళాశాల లెటర్ ఆఫ్ పర్మిషన్‌పై సందిగ్ధత కొనసాగుతోంది. ఇప్పటికే రెండు సార్లు ఎల్‌ఓపీని నేషనల్ మెడికల్ కమిషన్ నిరాకరించింది. దాంతో వైద్యకళాశాల అధికారులు మూడోసారి అప్పీల్‌కు వెళ్లారు.

తొలగని సందిగ్ధత

మెదక్ మెడికల్ కాలేజీపై మరోసారి అప్పీల్

- నేషనల్ మెడికల్ కమిషన్ నిర్ణయంపై ఉత్కంఠ
- ఇప్పటికే రెండుసార్లు అనుమతి నిరాకరించిన ఎన్‌ఎంసీ
- వసతులు, వైద్య పరికరాల ఏర్పాటుపై అసంతృప్తి
- లోపాలను సరిచేసిన అధికార యంత్రాంగం

మెదక్ అర్బన్, ఆగస్టు 25: మెదక్ మెడికల్ కాలేజీకి లెటర్ ఆఫ్ పర్మిషన్ కోసం వైద్యక ళాశాల అధికారులు మూడోసారి అప్పీల్‌కు వెళ్లారు. గతంలో నేషనల్ మెడికల్ కమిషన్ లేవనెత్తిన లోపాలను సరిచేసి, అందుకు సంబంధించిన ఫొటోలు, వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. మరో రెండు రోజుల్లో ఢిల్లీకి నివేదిక పం పనున్నారు.

100 సీట్లతో మంజూరు.. 50 సీట్లు కోత

గత ప్రభుత్వం మెదక్‌కు 100 సీట్లతో మెడికల్ కాలేజీని మంజూరు చేస్తూ గతేడాది జూలై 5న జీవో జారీ చేసింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచి తరగతులను ప్రారం భించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. కళాశాల భవన నిర్మాణం కోసం రూ.180 కోట్లు మంజూరు చేస్తూ.. పరిపాలనా అనమతుల కోసం సెప్టెంబర్ 16న జీవో 162 జారీ చేసింది. వైద్య కళాశాల భవన నిర్మాణం కోసం పిల్లికొట్టాల్ మాతాశిశు సంరక్షణ ఆసు పత్రి పక్కన 14 ఎకరాలను కేటాయించింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం 50 సీట్లకు కుదించి.. పాత కలెక్టరేట్ భవనంలో వైద్య కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధి కారులు పూర్తిచేసి అనుమతుల కోసం దరఖాస్తు చేశారు.

వసతుల కల్పనపై అసంతృప్తి

మెడికల్ కళాశాల ఏర్పాటుకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతి తప్పనిసరి. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే ఎన్‌ఎంసీ పంపించే బృందం కాలేజీలో తని ఖీలు వివిధ పారామీటర్లను పరిశీలిస్తుంది. మెదక్ మెడికల్ కాలేజీని జూన్ 24న తొలిసారి జాతీయ వైద్య విధాన మండలి సభ్యులు తనిఖీ చేశారు. వసతులు, బోధన సిబ్బంది నియామకాలు.. తదితర అంశాలను పరిశీలించి నిబంధనల మేరకు పలు సూచనలు చేసింది. కానీ, సూచనలకు అనుగుణంగా మార్పులు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా చేశారనే విమర్శలున్నాయి. దీంతో, కళాశాలలో తరగతుల నిర్వహణకు సరైన వస తులు లేవని, భవన లీజ్ విష యంలో నిబంధనలు పాటించలేదనే కారణాలతో అనుమతి నిరాకరించింది. అనంతరం అధికారులు పలు మార్పులు చేసిన మరోసారి అప్పీల్‌కు వెళ్లారు. నిబంధనలమేరకు సదుపాయాలను కల్పించారు. 45 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమిం చారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్ గత వారం ఢిల్లీలోని ఎన్‌ఎంసీ కార్యాలయా నికి వెళ్లి అన్ని డాక్యుమెంట్లను అందజేసినా లెటర్ ఆఫ్ పర్మిషన్ ఇవ్వడానికి నేషనల్ మెడికల్ కమిషన్ మరోసారి నిరాకరించింది.

మరోసారి పరిశీలించాలని అప్పీల్

లెటర్ ఆఫ్ పర్మిషన్ కోసం తాజాగా కళాశాల అధికారులు మరోసారి అప్పీల్‌కు వెళ్లారు. మరోసారి పరిశీలించాలని ఎన్‌ఎంసీని కోరారు. ఇందుకోసం వారం రోజులుగా కసరత్తు చేస్తున్నారు. కాలేజీ ఏర్పాటు చేయనున్న భవనంలో మౌలికవసతులు, బోధన, బోధనేతర సౌకర్యాలను ఏర్పాటు చేసి.. ఆ వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. రెండు రోజుల్లో ఢిల్లీకి వెళ్లి అన్ని డాక్యుమెంట్లను అందజేయడానికి సిద్ధమవుతున్నారు. ఎన్‌ఎంసీ సంతృప్తి చెందితే ఎల్‌ఓపీ వచ్చే అవకాశం ఉంటుంది.



రెండు రోజుల్లో ఢిల్లీకి

మెడికల్ కళాశాల ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే రెండుసార్లు అనుమతి నిరాకరించారు. ఎన్‌ఎంసీ మార్గ దర్శకాల ప్రకారం. ఫ్యాకల్టీ, స్టాఫ్ రిక్రూ ట్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, మెటిరియల్ ఇతర సదుపాయాలను కల్పించాం. అన్ని రకాల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌ లోడ్ చేశాం. రెండు రోజుల్లో నేరుగా ఢిల్లీ ఎన్‌ఎంసీకి వెళ్లి డాక్యుమెంట్లను అందజేస్తాం. ఈ విద్యా సంవ త్సరంలో తరగతులను ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అనుమతి వస్తుందని ఆశిస్తున్నాం.

-రవీందర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్

రేవంత్.. హైడ్రామాలు

ఆక్రమణలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- గతంలో అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకునే దమ్ముందా?
- ప్రజా సమస్యలు పక్కదారి పట్టించేందుకే 'హైడ్రా' కూల్చివేతలు
- దేశంలోనే అత్యధిక మంది సభ్యులున్న పార్టీ బీజేపీ
- బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- సంగారెడ్డిలో బీజేపీ సభ్యత్వ నమోదు వర్క్‌షాప్

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25 : ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే హైడ్రా పేరిట సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రామాలు చే స్తున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సంగారెడ్డి చౌరస్తాలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమో దు వర్క్‌షాప్‌కు ఆయన హాజరై మాట్లాడారు. సీఎం తమ్ముడి తో పాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులపై వస్తున్న కబ్జా ఆరోపణలపై సీఎం స్పందించాలని డిమాండ్ చేశారు. సెలబ్రిటీల నిర్మాణాలు కూల్చేసి హడావుడి చేయడం తప్ప సీఎం రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై హైడ్రా కేసు నమోదు చేసినా ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎంకు దమ్ముంటే అక్రమ నిర్మాణాలపై ప త్రం విడుదల చేయాలని, అక్రమ నిర్మాణాలకు గతంలో అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో 17 లక్షల ఎకరాల అసైన్డ్ భూ మి, 6 లక్షల ఎకరాల అటవీ భూమి, లక్షల ఎకరాల దేవాలయ భూములు అన్యాక్రాంతమయ్యాయని పేర్కొన్నారు. వాటిపై దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల హామీలు అమలు చేయలేక..

ఎన్నికల హామీలు అమలు చేయకుండా హైడ్రా పేరిట రేవం త్ సర్కారు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నదని ఆరోపించారు. రు ణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపిం చారు. రుణమాఫీ కోసం రూ.49 వేల కోట్ల అవసరమైతే.. ప్రభుత్వం రూ.17,950 కోట్లు మాత్రమే విడుదల చేసి రుణమాఫీ పూర్తయిందని ఎలా చెప్తున్నారని ప్రశ్నించారు.

అధికారమే లక్ష్యంగా ముందుకు

తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బీజేపీ ఫ్లోర్ లీడర్ తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రె స్‌తో సమానంగా 8 పార్లమెంట్ సీట్లను బీజేపీ గెలుచుకొన్నదని పేర్కొన్నారు. దేశంలోనే అత్యధిక సభ్యులున్న పార్టీగా బీజేపీ అవ తరించిందని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అ భివృద్ధి చెందుతున్నదన్నారు. దేశంలోనే బీజేపీకి అత్యధిక సభ్య త్వం ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక పాలనను ఎండగడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ఉండి పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణలో రామరాజ్య స్థాపనకు ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చా రు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు అంజిరెడ్డి, నాయకులు విష్ణువ ర్ధన్‌రెడ్డి, రవీందర్, రమేశ్, వెంకటనర్సింహారెడ్డి, పోచారం రాము లు, ప్రతాప్‌రెడ్డి, అనంతరావుకులకర్ణి, రాజశేఖర్‌రెడ్డి, విజయ్, ద్వారకారవి తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

తవ్వేయ్.. అమ్మేయ్..!

- కోహీర్ మండలంలో జోరుగా మట్టి దందా
- ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు



కోహీర్ మండలంలోని చింతలగట్టులో అసైన్డ్ మట్టి తవ్వకాలు (ఫైల్)

కోహీర్, ఆగస్టు 25: సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో మట్టి దందా జోరుగా సాగుతున్నది. చెరువులు, ప్రభుత్వ, అసైన్డ్, ప్రైవేటు భూముల్లో యథేచ్ఛగా తవ్వేసి దర్జాగా తరలిస్తున్నారు. మండలంలోని చింతలగట్టు, వెంకటాపూర్, కవెల్లి, దిగ్వాల్, మద్రి, పిచేర్యాగడి, పైడిగుమ్మల్, సజ్జాపూర్, మాచిరెడ్డిపల్లి తదితర గ్రామాల శివార్లలో జోరుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా ఎక్స్‌కవేటర్లతో తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. చింతలఘట్టు గ్రామ శివారులోని జాతీయ రహదారికి అనుకొని ఉన్న అసైన్డ్ భూముల్లో నిత్యం తవ్వకాలు జరుగుతున్నాయి. వెంకటాపూర్ గ్రామ పరిధిలోని బామున్ చెరువు, దిగ్వాల్ శివారులోని అసైన్డ్, ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో, మద్రి శివారులోని వక్ఫ్ భూముల్లో అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. పిచేర్యాగడి గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల్లో, మాచిరెడ్డిపల్లి గ్రామ శివారులోని నర్సారెడ్డి చెరువులోనూ తవ్వకాలు జరుగుతున్నాయి.

అక్రమార్కులకు కాసుల పంట

కోహీర్ మండలంలోని చింతలగట్టు, దిగ్వాల్, కవెల్లి, కొత్తూర్(డి) గ్రామాల పరిధిలో 65వ జాతీయ రహదారి పక్కన వెంచర్లు, రోడ్లు, గృహాలు, వాణిజ్య నిర్మాణాల కోసం మట్టిని తరలించి సొమ్ము చేసుకొంటున్నారు. డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లోనూ రియల్టర్లు వ్యవసాయ భూములను కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిలో రహదారుల ఏర్పాటు, భూమి చదును చేయడం కోసం మట్టి, మొరం తరలిస్తున్నారు. వివిధ గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి కూడా అనుమతులు లేకుండానే మట్టిని తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలపై ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల, అధికారుల అండదండలతోనే అక్రమార్కులు రెచ్చిపోతున్నారని ఆరోపిస్తున్నారు.

డంపింగ్ యార్డు లేక కంపు..

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- సంగారెడ్డి జిల్లా కేంద్రంలో చెత్త సమస్య
- ప్రతీ రోజు 50 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 25: జిల్లా కేంద్రమైన సంగారెడ్డి గ్రేడ్ వన్ మునిసి పాలిటీ చెత్తసేకరణలో సమస్యలు ఎదురవుతున్నాయి. హైదరాబాద్ నగరానికి అనుకుని ఉన్న ఈ మున్సిపాలిటీలో దాదాపు 2 లక్షల జనాభా, 38 వార్డులు, 30 వేలకు పైగా భవనాలు ఉన్నాయి. ప్రతీరోజు రోజుకు 50 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతున్నది. ఇంత చెత్తను పారబోయడానికి కాల్సిన వచ్చిన సమస్యలై స్పందిస్తూ ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాగం నిర్లక్ష్యం వల్ల పట్టణంలో డంపింగ్ యార్డు నిర్మాణానికి నోచుకో వడం లేదన్న ఆరోపణలున్నాయి. సంగారెడ్డిలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ చేయడం అధికారు లకు తలనొప్పిగా మారింది. పారిశుద్యంపై ప్రతీ నెలా రూ.లక్షలు వెచ్చిస్తున్న పురపాలకశాఖ అధికారులు డంపింగ్ ఏర్పాటు విషయంలో శ్రద్ధ చూపడంలేదన్న ఆరోపణలున్నాయి. డంపింగ్ యార్డు లేకపోవడంతో పట్టణంలో సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను చుట్టుపక్కల గ్రామాల శివారులలో రాత్రి వేళల్లో పారబోస్తు న్నారు. పగటిపూట ఇంటింటి నుండి చెత్తను సేకరించి రాత్రి వేళల్లో దొంగచాటుగా ఆయా గ్రామాల శివారుల్లోని గుంతలు, చెరువు గట్లపై పారబోయడంతో ప్రజలు దుర్గంధంతో ఇబ్బం దులు పడుతున్నారు. సంగారెడ్డి మండలంలోని పసల్‌వాదీ, హనుమాన్‌నగర్, ఈర్గిపల్లి, కంది మండలం అరుట్ల, చేర్యాల, అందోలు మండలం డాకూరు, పుల్కల్ మండలం బస్వాపూర్, గంగోజిపేట గ్రామాల శివారుల ప్రాంతాలకు రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా పెద్ద పెద్ద లారీల్లో తరలిస్తూ డంప్ చేస్తున్నారు. అక్కడ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత పెల్లుబుక డంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది. ఐదారు నెలలుగా పసల్‌వాదీ గ్రామ శివారులో ఉన్న వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్కులో చెత్తను నిల్వ చేస్తున్నారు. పార్కులో పేరుకుపో యిన ఈ చెత్తను తొలగించకపోవడంతో వ్యర్థాలు మురిగి భరించలేని తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నది.

రోజుకు 50 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ

సంగారెడ్డి పట్టణంలో రోజుకు 50 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ జరుగుతున్నది. ఇందు కోసం మునిసిపల్ పారిశద్య విభాగంలో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేం దుకు వార్డుకో వాహనం చొప్పున 38 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ చేసేందుకు అదనంగా పది ట్రాక్టర్లు ఉన్నాయి. వీటితో పాటుగా రాత్రి వేళలో సుదూర ప్రాంతాలకు చెత్తను తరలించేందుకు భారీ వాహనాలను సైతం వినియోగిస్తు న్నారు. ఇందు కోసం ప్రతీ నెలా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ చెత్త సేకరణ సక్రమంగా జరుగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. గత కొన్ని నెలలుగా చెత్తను పట్టణం లోని బొబ్బిలికుంట చెరువులో పారబోస్తున్నారు. అంతేకా కుండా, పట్టణంలోని మటన్, చికెన్ దుకాణాల నుండి సేక రించిన వ్యర్థాలను సైతం చెరువు గట్లపై పారబోస్తుండటంతో దుర్వాస వ్యాపిస్తుంది.

నిధులున్నా జరగని స్థల సేకరణ

డంపింగ్ యార్డు నిర్మాణం కోసం ఏడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించింది. అయితే, డంపింగ్ యార్డు నిర్మాణం కోసం స్థల సేకరణ అధికారులకు తలనొ ప్పిగా మారింది. 2017లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి కాంట్రాక్టరుకు పనులను అప్పగించారు. మొదట్లో కంది మండలం చేర్యాల గ్రామ శివారులో డంపింగ్ యార్డు నిర్మిం చేందుకు ఐదెకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి ప్రహరీ నిర్మి స్తుండగా గ్రామస్థులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపో యాయి. తర్వాత కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామ శివారులో సర్కార్ స్థలాన్ని గుర్తించినప్పటికీ, అక్కడ కూడా ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో పనులు మొదలు పెట్టలేకపోయారు.



సంగారెడ్డిలోని శాంతినగర్, ప్రశాంత్‌నగర్ కాలనీల్లో రోడ్డు పక్కన పారబోసిన చెత్త



సంగారెడ్డిలోని బొబ్బిలికుంటలో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్త

ప్రియురాలు దక్కలేదని యువకుడి ఆత్మహత్య


చెందుబాబు(ఫైల్)

మనోహరాబాద్, ఆగస్టు 25: ప్రేమించిన అమ్మాయి దక్కడంలేదన్న మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగాయపల్లికి చెందిన బండారి చందుబాబు(25) ఓ అమ్మాయిని కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. ఇది తెలుసుకున్న చందు తల్లిదండ్రులు అమ్మాయి తల్లిదండ్రులతో వివాహం విషయమై మాట్లాడగా వారు నిరాకరించారు. అనంతరం ఆ అమ్మాయికి వేరే పెళ్లి సంబంధం చూశారు. దీంతో మనస్తాపానికి గురైన చందుబాబు ఈ నెల 13న గ్రామ శివారులో పురుగుల మందుతాగాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని వెంటనే అతడిని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ములుగు మండలం లక్ష్మక్కపలిలోని ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయినా పరిస్థితి విషమించడంతో శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం మృతుడి తల్లి బండారు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులే వంటచేయాలే..!



కౌడిపల్లి, ఆగస్టు 25 : కౌడిపల్లి మండలం వెల్మకన్నెలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులే వంట చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. 105 మంది విద్యార్థులు ఉంటున్న ఈ హాస్టల్‌లో వంట చేసే కామటి సావిత్రి గత మె నెలలో మృతి చెందగా.. మరొకరు మల్లేశం అనారోగ్యంతో నాలుగు రోజులుగా విధులకు రావడంలేదు. ఆదివారం ఉదయం హాస్టల్‌లో ఓ విద్యార్థి చికెన్ కడుగుతూ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి కెమెరాకు చిక్కాడు. ఈ విషయంపై వార్డెన్ జయరాజ్‌ను వివరణ కోరగా వంట మనిషి లేక సమస్య ఏర్పడి ఉంటుందని, తిరిగి పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.


మేడ్చల్ జిల్లా బాచుపల్లిలోని ఈఎస్‌ఐ ప్రాంతీయ వైద్య కేంద్రం

అత్యవసర సేవలు..
అందనంత దూరం

- సమస్యలు ఓ చోట.. కార్యాలయాలు మరోచోట
- దూరాభారంతో ప్రజలకు తప్పని కష్టాలు
- స్థానికంగా ఏర్పాటు చేయాలంటున్న జనం

జిన్నారం, ఆగస్టు 25: పారిశ్రామిక మండలమైన జిన్నారంలో నిత్యం అందుబాటులో ఉండాల్సిన పలు ముఖ్యమైన అధికారుల కార్యాలయాలు ఎక్కడో దూరంగా ఉండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. ఈఎస్‌ఐ వైద్యశాల మండలానికి దూరంగా పక్క జిల్లాలో ఉండగా.. అగ్ని ప్రమాదాలను నివారించాల్సిన ఫైర్‌ఇంజిన్ కూడా పక్క జిల్లాల నుంచి రావాల్సిందే. ఫిర్యాదుదారులు పీసీబీ అధికారుల, పరిశ్రమల భద్రతా విభాగం కార్యాలయాలకు వెళ్లాలన్నా దూరాభారం తప్పడంలేదు. నాలుగు రోజుల్లో కిష్టయ్యపల్లి గ్రామంలో కాలుష్య వ్యర్థ జలాలు తాగి 9 పాడి గేదెలు మృతి చెందగా.. బాధితులు గేదెల కళేబరాలతో సనత్‌నగర్‌లోని పీసీబీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. నిరంతరం నిఘా కోసం పారిశ్రామిక వాడలో పీసీబీ కార్యాలయం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం ఇక్కడి పరిస్థితికి నిదర్శనం

వైద్యానికి దూరాభారం..

జిన్నారంలో అధికారుల కార్యాలయాలు, వైద్యశాల అందుబాటులో లేక ప్రజలు నిత్యం ఇక్కట్లు పడుతున్నారు. 350 పరిశ్రమలు, 70 వేల మంది కార్మికులు, సుమారు 50 వేల మంది ఈఎస్‌ఐ బీమా వైద్యం అర్హులు ఉన్న ఈ మండలంలో చికిత్స అందించే చిన్నపాటి డిస్పెన్సరీ లేదు. జిన్నారం, వావిలాల, కొడకంచి, గడ్డపోతారం, కాజీపల్లి, బొల్లారంలో పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో పని చేసే కార్మికులు బీమా వైద్యం అందుబాటులో లేక స్థానిక ప్రైవేటు క్లీనిక్‌లను ఆశ్రయిస్తున్నారు. బొల్లారంలో గతంలో ఉన్న ప్రాంతీయ ఈఎస్‌ఐ వైద్య కేంద్రాన్ని 2019లో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాచుపల్లికి తరలించారు. దీంతో ఈ ప్రాంత కార్మికులు వైద్యం కోసం వెళ్లాలంటే వ్యయాప్రయాసలు తప్పడంలేదు. బొల్లారంలో ఈఎస్‌ఐ భవనం కోసం స్థలాన్ని కేటాయించినా నిధుల మంజూరుకు ఎలాంటి ప్రయత్నం చేయడంలేదు. బొల్లారం సహ గడ్డపోతారంలో ఈఎస్‌ఐ వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ కూడా ఉన్నది.

తప్పని నిరీక్షణ..


రామచంద్రాపురంలోని పీసీబీ కార్యాలయం

పారిశ్రామిక ప్రమాదాల నివారణకు అత్యవసరమైన ఫైర్‌స్టేషన్ స్థానికంగా అందుబాటులో లేక ప్రమాదాల తీవ్రత అధికమవుతున్నది. ఇక్కడ ఉన్నవాటిలో 80 శాతం రసాయనిక పరిశ్రమలేకాగా తరుచూ చిన్న చితక, భారీ అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ 20 కిమీటర్ల దూరం నుంచి ఫైర్ ఇంజిన్ల రాక కోసం నిరీక్షణ తప్పడం లేదు.. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం తీవ్రమవుతున్నది. గడ్డపోతారం, లేదా బొల్లారంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదన అమలుకు నోచుకోవడం లేదు.

పీసీబీ, భద్రతా కార్యాలయాలూ దూరమే..

మండలంలో నిత్యం సేవలు అవసరం ఉన్న పీసీబీ (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు), పరిశ్రమల భద్రతా తనిఖీల విభాగం అధికారుల కార్యాలాయాలూ స్థానికంగా అందుబాటులో లేవు. జల, వాయు, ఘన కాలుష్యం పై ఫిర్యాదులు చేయాలంటే రామచంద్రాపురంలోని పీసీబీ ప్రాంతీయ కార్యాలయం వెళ్లాల్సి వస్తున్నది. ఫిర్యాదుల పరిశీలనకు అధికారులు వచ్చే లోపే సమస్య రూపు మారడంతో పక్కదారి పడుతున్నది. నిత్యం వేలాది మందికి సేవలు అందించే ఈ కార్యాలయాలను స్థానికంగా మండల పరిధిలో ఏర్పాటు చేయాలని మండల వాసులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సమాజ శ్రేయస్సుకోసమే
విశ్వశాంతి యాత్ర


విశ్వశాంతియాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ సురేష్‌షెట్కార్

పటాన్‌చెరు, ఆగస్టు 25: సమాజ శ్రేయస్సుకోసమే వీరశైవలింగాయత్ సమాజం ఆధ్వర్యంలో విశ్వశాంతి పాదయాత్ర నిర్వహిస్తున్నామని, ఇది ఎంతో స్ఫూర్తి నింపుతున్నదని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు వీరశైవలింగాయత్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఉమామహేశ్వర ఆలయం నుంచి బొంతపల్లి వీరబద్ర ఆలయం వరకు చేపట్టిన పాదయాత్రను వారు ప్రారంభించారు. సమసమాజం కోసం 12వ దశాబ్దంలోనే మహాత్మా బసవేశ్వరుడు చేపట్టిన సంఘ సంస్కరణలు ఎంతో ప్రభావం చూపాయన్నారు. నేటి మన భారత రాజ్యాంగం సైతం ఆయన ఆదర్శాలనే కొనసాగిస్తున్నదన్నారు. బసవేశ్వరుడి స్ఫూర్తితో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నిర్వహకుడు అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


రేణుక

మనోహరాబాద్, ఆగస్టు 25 : ఇంట్లో గొడవ పడి బయటికెళ్లిన వివాహిత అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాలు ప్రకారం కాళ్లకల్ గ్రామానికి చెందిన ఉట్ల రేణుక(35) భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి పని నిమిత్తం హైదారాబాద్‌లోని అల్వాల్ బొల్లారంలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఇంట్లో దంపతుల మధ్య గొడవ కావడంతో బుధవారం రేణుకను తన తల్లిగారి గ్రామం రంగాయపల్లి వద్ద భర్త వదిలివెళ్లాడు. దీంతో శుక్రవారం రేణుక తన తల్లికి దండుపల్లికి వెళ్తున్న అని చెప్పి బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. విషయం తెలిసిన భర్త చుట్టుపక్కల, బంధుమిత్రుల వద్ద వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో ఆదివారం భర్త ఉట్ల పాండు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు

రక్తమోడిన రహదారులు

● వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

● పలువురికి గాయాలు



నారాయణఖేడ్: శ్రీనివాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ, నేషనల్ హైవే సిబ్బంది

నారాయణఖేడ్, ఆగస్టు 25: ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందగా.. పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, సిద్దిపేట జిల్లా కొండపాక, చేర్యాల మండలాల్లో చోటు చేసుకున్నది. ఎదురుగా వస్తున్న లారీని బైక్‌తో రాంగ్‌రూట్‌లో వెళ్లి ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మృతిచెందారు. నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి వివరాల ప్రకారం.. కంగ్టి మండలం బీంరాకు చెందిన సునీల్, మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుక నారంగల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(27) బైక్‌పై జోగిపేట వైపు వెళ్తున్నారు. నారాయణకేడ్ పరిధిలోని నిజాంపేట సమీపంలో జాతీయ రహదారి 161పై హర్యానాకు చెందిన లారీ నాందేడ్‌కు వెళ్తుండగా.. రాంగ్‌రూట్‌లో వెళ్లిన వీరు ఢీకొట్టారు. దీంతో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాల పాలైన సునీల్‌ను మెరుగైన వైద్యం కోసం జోగిపేట ఆస్పత్రికి తరలించగా.. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. రాంగ్‌రూట్‌లో రావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

చేర్యాల మండలంలో...



గాయాలపాలైన బోయన్నగారి బాలకృష్ణ

చేర్యాల, ఆగస్టు 25: చేర్యాల పట్టణ శివారు నర్సాయపల్లి దారిలో బొలెరో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. కర్నూలు జిల్లా డోన్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన బోయ హరి(26)తో పాటు నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం గూటిపల్లి గ్రామానికి చెందిన బోయన్నగారి బాలకృష్ణ తదితరులు నర్సాయపల్లి శివారులో ఓ భవన నిర్మాణం కూలీ పనులు నిర్వహిస్తున్నారు. ఆదివారం చేర్యాల పట్టణంలో సామగ్రి కొనుగోలు చేసి బైక్‌పై తిరిగి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న బొలెరో ఢీకొన్నది. ఈ ఘటనలో హరి అక్కడికక్కడే మృతిచెందగా.. బాలకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వ్యవసాయ బావుల వద్ద ఉన్న రైతులు గమనించి పోలీసులకు సమాచారమందించారు. బాలకృష్ణను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

కొండపాక మండలంలో..



వీరేశం(ఫైల్)

కొండపాక, ఆగస్టు 25: కొండపాక శివారులోని ఆనంద నిలయం వృద్ధాశ్రమం సమీపంలో రాజీవ్ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి సిద్దిపేట వెళ్తున్న కారు డ్రైవర్ వేగంగా వెళ్లి ముందుగా ఉన్న బైక్‌ను ఢీకొట్టి సడన్ బ్రేక్ వేశాడు. కారు వెనకాలే వస్తున్న మరో ద్విచక్ర వాహనం కారుకు తగిలి ముందుకు వెళ్లి.. మరో బైక్‌కు తగిలింది. దీంతో బైక్‌పై ఉన్న కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామానికి చెందిన అందే వీరేశం(36) తలకు బలమైన గాయాలయ్యాయి. అలాగే మరో బైక్‌పై ఉన్న దుద్దెడ గ్రామానికి చెందిన రాకేష్, లక్ష్మణ్‌కు గాయాలు కాగా.. వీరిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అందే వీరేశం చికిత్స పొందుతూ మృతిచెందాడు. వీరేశం గురువన్నపేట నుంచి శనిగరం బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. కుకునూరుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ రోడ్డెట్ల ఉందిర బావో..

● బస్సు నడుపుతూ పాటందుకున్న డ్రైవర్

● సోషల్ మీడియాలో వైరల్



డ్రైవింగ్ చేస్తూ పాట పాడుతున్న ఆర్టీసీ డ్రైవర్

మునిపల్లి, ఆగస్టు 24 : గుంతలమయంగా ఉన్న రోడ్డుపై బస్సును నడుపుతూ ఓ ఆర్టీసీ డ్రైవర్.. రోడ్ల దుస్థితి, డ్రైవర్ల కష్టాలను పాట రూపంలో ప్రయాణికులకు వినిపించాడు. కొందరు ఫోన్‌లో రికార్డు చేసి పోస్టు చేయడంతో సోషల్ మీడియాలో ఆ వీడియో కాస్త వైరల్ అయ్యింది. సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సదాశివపేట నుంచి మునిపల్లి మండలం కంకోల్, తాటిపల్లి గ్రామాల మీదుగా మక్తక్యాసారంకు నడుస్తుంది. తాటిపల్లి నుంచి మక్తక్యాసారం వరకు సుమారు 9కిలోమీటర్ల మేర బీటీ రోడ్డును మరమ్మతుల కోసం తవ్వారు. నెలలు గడుస్తున్నా ఆ పనులు పూర్తికాకపోవడంతో, వర్షాలకు గుంతమయంగా మారింది. ఆ దారిలో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆదివారం ఈ రోడ్డు గుండా ఆర్టీసీ బస్సు నడుపుతున్న ఓ డ్రైవర్ రోడ్డు పరిస్థితిని చూసి "ఈ రోడ్డెట్ల ఉందిర బావో.. మక్తక్యాసారం రోడ్డెప్పుడు మారుతుందిరో మావో.. అంటూ పాటందుకున్నాడు. అది కాస్త వైరల్ అయ్యింది.

ఆకుకూరలతో సంపూర్ణ ఆరోగ్యం



కేవీకేలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పోషకాహార నిపుణులు డా. సలోమియేసుదాస్

● ఆకుకూరల సంప్రదాయాన్ని సమాజానికి పరిచయం చేద్దాం

● పోషకాహార నిపుణులు డాక్టర్ సలోమియేసుదాస్

జహీరాబాద్, ఆగస్టు 25: మనం నిత్యం తీసుకునే ఆహారంతోపాటు ఆకుకూరలను కలుపుకుని తింటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని పోషకాహార నిపుణులు డా. సలోమియేసుదాస్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ మండలంలోని అల్గోల్‌లో గల కేవీకే(కృషి విజ్ఞాన కేంద్రం-డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ)-డీడీఎస్ ఆధ్వర్యంలో ఆకుకూరల పండుగను నిర్వహించారు. ముందుగా వారంతా ఝురాసంగం మండలంలోని పొట్టిపల్లిలో డీడీఎస్ మహిళా సంఘం నాయకురాలు పొట్టిపల్లి మొగులమ్మ పంట పొలాన్ని సందర్శించారు. పొలాల్లో ఏ రకమైన ఆకుకూరలు దొరుకుతాయని, తదితర వివరాలను అడిగి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. అనంతరం జహీరాబాద్ మండలంలోని అల్గోల్ గ్రామ శివారులో గల కేవీకేలో నిర్వహించిన సమావేశంలో సందర్శకులు, మహిళలు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రకృతిలో సహజసిద్ధంగా ఐదు రకాలకు పైగానే గడ్డి మొక్కలు ఉంటాయన్నారు. అందులో ఆకుకూరలు, ఔషధ మొక్కలు, కలుపు మొక్కలు, కంపోస్టు ఎరువు తయారీకి ఉపయోగపడే మొక్కలు, పశువులకు మేతగా ఉపయోగపడే మొక్కలు ఉంటాయన్నారు. సహజసిద్ధంగా లభించే ఆకు కూరల కంటూ ప్రత్యేకంగా విత్తనాలు దొరకవని, వాటంతట అవే భూమిపై, పంట పొలాల్లో మొలకెత్తుతాయని పేర్కొన్నారు. ఒక్కో ఆకుకూరతో ఒక్కో రకమైన ప్రయోజనం ఉంటుందని, 40 రకాల ఆకుకూరల వివరాల గురించి వివరించారు. గత 20 ఏళ్ల కిందటే డీడీఎస్ ఆధ్వర్యంలో సాగుచేయని ఆకుకూరలపై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రీషన్(ఎన్ఐఎన్) వారితో కలిసి పరిశోధనలు చేశామన్నారు. తమ పరిశోధనల ద్వారా మార్కెట్‌లో లభించే ఆకు కూరలకంటే సహజ సిద్ధంగా లభించే ఆకు కూరల్లో చాలా పోషకాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. నేటికీ ఆకు కూరలు మరిచిపోకూడదనే సంప్రదాయాన్ని దృష్టిలో పెట్టుకుని.. డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో ప్రతియేటా ఆకుకూరల పండుగను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం జీవవైవిధ్య రైతులు లక్ష్మమ్మ, చంద్రమ్మ, మొగులమ్మ మాట్లాడుతూ పంట పొలాల్లో సహజంగా లభించే ఆకుకూరలను కలుపు మొక్కలుగా పరిగణిస్తూ.. రైతులు రసాయనాలను పిచికారీ చేయడంతో వాటి ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. మనం మరిచిపోతున్న ఆకుకూరలకు మార్కెట్లో మరింత డిమాండ్ ఉందని వారు గుర్తుచేశారు. సహజంగా తుమ్మికూర, తట్టెల్లి, అడవిమెంతం, జొన్నచెంచలి, అడవిసోయ, దొగ్గలి, ముల్లుదొగ్గలి, బంకంటి, పెత్తకాశ, ఎర్రకాశ, తెల్లబచ్చలి, ఎర్ర, తెల్లపుండి, ఉత్తరేణి, దూసరి, చెన్నంగి, తగిరెంచ తెల్లగర్జ, చామగడ్డ, పోతపత్రం, ఎర్రగర్జ, సన్నవాయి, నాగచెవిలి, గునుగు, మునగకూర, సన్నవాయిలి, ఎర్రగునుగు, చిత్రమశం, తడకదొగ్గలి, గంగవాయిలి, చిన్నకాశ, పప్పుకేర, గుర్మాశి తదితర ఆకూరలు లభిస్తాయని వివరించారు. ఇదిలా ఉండగా సందర్శకులు, స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు ఆకుకూరల వినియోగం, పండించే విధానంపై డీడీఎస్ మహిళా రైతులను అడిగి తెలుసుకున్నారు. డీడీఎస్ మహిళా రైతులు 20 రకాల ఆకుకూరలతో తయారుచేసిన వంటల భోజనం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆకు కూరల రుచులను చూసి సందర్శకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కేవీకే శాస్త్రవేత్తలు శైలజ, రమేష్, డీడీఎస్ ఉద్యోగులు మాణిక్యం, జనరల్‌నర్సమ్మ, చిన్ననర్సమ్మ, మంజుల, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకుకూరల ప్రయోజనాల గురించి డీడీఎస్ సభ్యులను అడిగి తెలుసుకుంటున్న సందర్శకులు



పొలాల్లో సహజ సిద్దంగా లభించిన ఆకు కూరలు

'అక్షరమాల'తో నిరుపేద విద్యార్థులకు అండ

● ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి



అక్షరమాల వలంటీర్లకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి

కంది, ఆగస్టు 25 : అక్షరమాల పేరిట ఐఐటీ-హెచ్ నిర్వహించే కార్యక్రమంతో నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటున్నామని ఆ సంస్థ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు. అక్షరమాల కార్యక్రమం నాలుగో వార్షికోత్సం ఐఐటీ-హెచ్‌లో ఆదివారం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసుల ద్వారా అకడమిక్ కోచింగ్, కెరీర్ కౌన్సెలింగ్ ఇచ్చేందుకు అక్షరమాల ద్వారా వలంటీర్లకు శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు చెబుతారు. అక్షరమాల ద్వారా ప్రస్తుతం 125 మంది వలంటీర్లు పని చేస్తున్నారు. అక్షరమాల వార్షికోత్సవం సందర్భంగా వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి.. చదువులో ప్రతిభ కనబరిచిన ఏడుగురు విద్యార్థులకు రూ.5వేల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు. అలాగే, ఐఐటీ-హెచ్ దత్తత తీసుకున్న మెదక్ జిల్లాలోని అంతారం, సలబత్‌పూర్, మొహ్మద్‌నగర్, కన్నవరం, భుజరంపేట గ్రామల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఎల్‌సీడీ ప్రొజెక్టర్లు, స్క్రీన్లు అందజేశారు.

4 కిలోమీటర్లు.. 16 మూలమలుపులు

● ప్రమాదకరంగా తేర్పోల్-కొండాపూర్

● దారి పొడవునా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు



కొండాపూర్-తేర్పోల్ వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు



రోడ్డుపైనే సర్కారు ముళ్లచెట్లు, పిచ్చి మొక్కలు

కొండాపూర్, ఆగస్టు 25: తేర్పోల్- కొండాపూర్‌కు వెళ్లే దారి మూలమలుపులతో ప్రమాదకరంగా ఉన్నది. మండలానికి 24 గ్రామపంచాయతీలు ఉండగా.. 16 గ్రామాలకు తేర్పోల్-కొండాపూర్ ప్రధాన రోడ్డు అనుసంధానంగా ఉన్నది. తేర్పోల్ నుంచి మండల కేంద్రమైన కొండాపూర్‌కు వెళ్లేందుకు 4 కిలోమీటర్లు మాత్రమే ఉన్నది. అయితే దారి పొడవునా 16 మూలమలుపులు, రోడ్డుపైనే వెలసిన సర్కారు ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తాయి. ఎనిమిది గ్రామాలకు చెందిన ప్రజలు మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రోడ్డు. అలాగే మల్లేపల్లి శివారు పరిశ్రమల్లో పనిచేసేందుకు దాదాపు 8 గ్రామాల నుంచి కార్మికులు ఈ దారిగుండానే వెళ్తారు. అదేవిధంగా పంచాయతీలకు డిజిటల్ ఇండియా(ఆన్‌లైన్) కేబుల్స్ కోసం రోడ్డు అంచును తవ్వి మ్యాన్‌వల్స్‌ను సైతం ఏర్పాటు చేశారు. అయితే నాలుగు కిలోమీటర్ల రోడ్డు మొత్తం పిచ్చిమొక్కలు, మూలమలుపులతో ఉన్నది. దీంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు భయాందోళన చెందుతూ ప్రయాణం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

పరిపాలన అధికారులు గ్రామాలను పర్యవేక్షించాలంటే ఈ రోడ్డుపైనే ప్రయాణించాలి. రోజుకో, వారానికో ఏదో ఒకశాఖ అధికారి వెళ్తుంటారు. మూలమలుపులను చూసినా.. పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడి తొలగింపు

హత్నూర, ఆగస్టు 25: మండల కేంద్రమైన హత్నూర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించినట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. పాఠశాలలో తాత్కాలిక ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోపి శనివారం 9వ తరగతి విద్యార్థి బాలరాజును చితకబాది గాయపర్చడంతో ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకున్నామని అన్నారు. అదేవిధంగా తదుపరి చర్యల కోసం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు.

సంగారెడ్డి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈగా శ్రీనాథ్



శ్రీనాథ్‌ను సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 25: సంగారెడ్డి జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈగా శ్రీనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎస్ఈగా ఇక్కడ పనిచేసిన మాధవరెడ్డి సరూర్‌నగర్ ఎస్ఈగా బదిలీపై వెళ్లారు. సంగారెడ్డి జిల్లా ట్రాన్స్ కో ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన శ్రీనాథ్‌ను విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, నాయకులు ఈశ్వరప్ప, గోవిందరావు, వీరయ్య, వెంకటేశం, శ్రీకర్‌రెడ్డి, కొండన్న, శ్రీశైలం, శ్రీనివాసరావు, రాజేశ్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు.

పిచ్చికుక్క దాడిలో పాడి గేదె మృతి



మృతిచెందిన పాడిగేదె

కల్హేర్/నారాయణఖేడ్, ఆగస్టు 25: పిచ్చి కుక్క దాడిలో పాడిగేదె మృతిచెందింది. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండలం, బాచేపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన పుట్టి సాయిలుకు చెందిన పాడిగేదెపై ఆదివారం పిచ్చి కుక్క దాడి చేయడంతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. బాచేపల్లితో పాటు, మండల పరిధిలోని రాంరెడ్డిపేట్‌లో కూడా కొందరు వ్యక్తులను కుక్కలు గాయపర్చినట్లు గ్రామస్థులు తెలిపారు. 15 రోజుల క్రితం బాచేపల్లి గ్రామానికి చెందిన వాటర్‌మన్ సాయిలును కుక్కలు గాయపర్చిన విషయం విదితమే. ఈ సమస్యను గ్రామ కార్యదర్శికి విన్నవించినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా కుక్కల బెడద నుంచి బాచేపల్లి గ్రామస్థులను రక్షించాలని కోరుతున్నారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు..



మృతిచెందిన గొర్రెలు

మద్దూరు, ఆగస్టు 25: కుక్కల దాడిలో 14 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటన మద్దూరు మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సిద్ధిక్‌కు చెందిన గొర్రెల షెడ్డులోకి శనివారం రాత్రి 9.30 గంటకు చొరబడిన కుక్కలు 14 గొర్రెలపై దాడిచేయడంతో మృతిచెందాయి. దీంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నాడు. అలాగే కుక్కల బెడదను తీర్చాలన్నాడు.

తల్లీకూతురు అదృశ్యం



కుమార్తె అలేఖ్యతో కవిత(ఫైల్)

తూప్రాన్, ఆగస్టు 25: తల్లీకూతురు అదృశ్యమైన సంఘటన తూప్రాన్ మండలం ఇమాంపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కవిత ఈనెల 22న తన కుమార్తె అలేఖ్యతో కలిసి తూప్రాన్‌లో బంధువులను పరామర్శించేందుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లింది. కానీ సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త స్వామి చుట్టుపక్కల, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రెయిన్‌డెడ్‌తో ఉపాధ్యాయుడి మృతి



శ్రీనివాస్(ఫైల్)

చిలప్‌చెడ్, ఆగస్టు 25: బ్రెయిన్‌డెడ్‌తో ఉపాధ్యాయుడు ఆదివారం మృతిచెందాడు. చిలప్‌చెడ్ మండలం భద్రతండా పంచాయతీ బంజారానగర్‌కు చెందిన జరుపుల శ్రీనివాస్(38) కొన్నేళ్లుగా గౌతాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కొన్నినెలల క్రితం పక్షవాతం వచ్చి.. చెయ్యి నోరు సరిగ్గా పనిచేయకపోవడంతో చికిత్స తీసుకున్నాడు. ఈ మధ్య బాగానే ఉన్నా.. వారంరోజుల క్రితం మరోమారు పక్షవాతం పనిచేయకపోవడంతో చికిత్స తీసకున్నాడు. ఈ మధ్య బాగానే ఉన్నపటికీ వారం రోజుల క్రితం మరోమారు పక్షపాతం రావడంతో కుటుంబీకులు హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం బ్రెయిన్ డెడ్ అయి మృతిచెందినట్లు చెప్పారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల

త్వరలో ఎంబీబీఎస్ మూడో బ్యాచ్!

● భర్తీ కానున్న మరో 150 సీట్లు

● 450 కి చేరుకోనున్న 'మెడికో'ల సంఖ్య

● థర్డ్ ఇయర్‌లోకి సంగారెడ్డి జీఎంసీ

● హాస్టల్ పక్కా భవనాల నిర్మాణాలు ఆలస్యం

● అద్దె భవనాల కోసం అధికారుల అన్వేషణ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 25: సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి(జీఎంసీ) ఎంబీబీఎస్ వైద్య విద్యార్థుల కొత్త బ్యాచ్(2024-25) రానున్నది. దీంతో ఈ కళాశాలలో ఫ్రెష్ బ్యాచ్ వైద్య విద్యార్థుల సందడి త్వరలో మొదలు కానున్నది. 2022లో ఫస్టియర్ తరగతులతో ఈ కళాశాల అందుబాటులోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఫస్టియర్, సెకండియర్ కలిసి 300 మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే రానున్న 150 మంది వైద్య విద్యార్థులను కలుపుకుని మెడికోల సంఖ్య 450 మందికి చేరుకోనున్నది. కాగా ఈ కళాశాలలో మూడో బ్యాచ్ విద్యార్థులు రానున్న నేపథ్యంలో కళాశాల అధికారులు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

పక్కా 'హాస్టల్' భవనాలు ఆలస్యం

ఇదిలా ఉండగా మెడికల్ కళాశాల నిర్మాణ పనుల్లో భాగంగా రెండో విడతలో రూ.143 కోట్లతో ఆర్అండ్‌బీ శాఖ వివిధ భవనాల నిర్మాణాలు చేపడుతున్నది. మెయిన్ బ్లాక్(జీ+2)తో పాటు ఎంబీబీఎస్ బాలురు, బాలికల హాస్టల్స్, స్టాఫ్ క్వార్టర్స్, కిచెన్ అండ్ డైనింగ్, బాయ్స్ రెసిడెంట్ హాస్టల్, మార్చురీ తదితర భవన నిర్మాణ పనులు ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. అయితే జీ+6 అంతస్తుల్లో ఎంబీబీఎస్ బాలుర హాస్టల్, జీ+8 అంతస్తుల్లో బాలికల హాస్టల్స్ పక్కా భవనాల పనులు జరుగుతున్నాయి. వచ్చేనెలలో కొత్త బ్యాచ్ మెడికోలు రానుండటంతో వసతి ఉండేందుకుగాను హాస్టల్ పక్కా భవనాలు ఇంకా సిద్ధం కాలేవు. తుది దశలోనే నిర్మాణాలు ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి పెద్ద మొత్తంలో బిల్లులు రావాల్సి ఉన్నది. అందుకే కొన్నిరోజులుగా భవన నిర్మాణ పనులు నెమ్మదించాయి. ఇటీవల మంత్రి దామోదర పర్యటించగా, పనుల్లో వేగం పెంచారు. కానీ ప్రభుత్వం నుంచి బిల్లులు వచ్చేవరకు సదరు కాంట్రాక్టర్ ఆ భవనాలు అప్పగించేందుకు సిద్ధంగా లేనట్లు తెలుస్తోంది. పక్కా భవనాల నిర్మాణాలు మరింత ఆలస్యం కానుండటంతో చేసేదేమీ లేక మెడికల్ కాలేజీ అధికారులు అద్దె భవనాలు వెతికే పనిలో పడ్డారు. ఇప్పటికే ఆరు నెలల కాలానికి అద్దె భవనాలు కావాలంటూ కళాశాల అధికారులు ప్రకటన జారీచేశారు.

ఎన్ఎంసీ ఆదేశాల మేరకు తరగతులు



వచ్చేనెలలో మూడో బ్యాచ్ ఫస్టియర్ 150 మంది విద్యార్థులు కౌన్సిలింగ్ ద్వారా అడ్మిషన్ పొందనున్నారు. ఎన్ఎంసీ ఆదేశాల మేరకు అక్టోబరు 1 నుంచి తరగతులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రానున్న వైద్య విద్యార్థుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. కళాశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న హాస్టల్స్ భవనాలు ఇంకా అప్పగించలేదు. ఇంకా నిర్మాణాలు పూర్తికావాల్సి ఉన్నది. అందుకోసం అద్దె భవనాల పరిశీలన చేస్తున్నాం. వసతితో పాటు బోధనకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం.

- డా.సుధామాధురి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, సంగారెడ్డి



నిర్మాణ దశలో వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాలు

అద్దె భవనాల్లో మళ్లీ హాస్టల్స్

వైద్య విద్యార్థుల వసతి కోసం ఈసారి కూడా మళ్లీ అద్దె భవనాలే దిక్కయ్యాయి. కళాశాల ప్రారంభమైన తొలి ఏడాది వైద్య విద్యార్థుల నుంచి ఇప్పటివరకు మెడికోలకు పక్కా భవనాలు సిద్ధం కాకపోవడంతో అద్దె భవనాల్లోనే ఉండాల్సి వస్తున్నది. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తాతో పాటు బైపాస్ రోడ్డులోని పలు భవనాల్లో వసతి కొనసాగిస్తున్నారు. ఆయా హాస్టల్స్‌లో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో సత్తా చాటిన కల్హేర్ విద్యార్థులు



కబడ్డీ, ఖోఖో పోటీల్లో సత్తా చాటిన హైస్కూల్ విద్యార్థులు

కల్హేర్, ఆగస్టు 25: మండల పరిధిలోని మార్డి ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల్లో కల్హేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహం విద్యార్థులు సత్తా చాటారు. అండర్ 17 విభాగంలో కబడ్డీలో మొదటి బహుమతి, ఖోఖోలో ద్వితీయ బహుమతులు, కబడ్డీ అండర్ 14 బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులు మండలస్థాయిలో తమ సత్తా చాటుకున్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కల్హేర్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్ కిషన్ అభినందించారు. ఈ క్రీడల్లో ఓవరాల్‌గా మండల పరిధిలోని క్రిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచారు.

గేదెల మృతితో నష్టపోయిన రైతును ఆదుకోవాలి



బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జిన్నారం, ఆగస్టు 25: కాలుష్య జలాలు తాగి పాడి గేదెలు మృతి చెందిన ఘటనలో బాధిత రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల కాలుష్య జలాలు సేవించి కిష్టయ్యపల్లి చెందిన రైతు సాయికుమార్ పాడి గేదెలు మరణించగా కాంగ్రెస్ నాయకులు వడ్డే కృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి ఎంపీ అశోక్, నీరుడి శ్రీనివాస్, జానాబాయి తదితరులు సాయికుమార్‌ను కలిసి పరామర్శించారు. పరిశ్రమల తీరుతో స్థానిక రైతులు ఎంతో నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గేదెల మృతికి కారణమైన పరిశ్రమల నుంచి నష్టపరిహారం ఇప్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఇదెక్కడి చోద్యం?

- అల్లాదుర్గం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే రెండు బస్సులు మారాల్సిందే
- నారాయణఖేడ్ డీలక్స్ స్టాప్‌ను ఎత్తేయడంతో ప్రజలకు తీవ్రమైన ఇక్కట్లు
- బస్సు కోసం 5 కి.మీ సర్వీస్ రోడ్డు పై నుంచి హైవేకు రావాల్సిందే
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రయాణికుల ఆగ్రహం

అల్లాదుర్గం, ఆగస్టు 25: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమపథకాలు అమలుచేస్తున్నప్పటికీ అందుకు తగినస్థాయిలో అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతున్నది. దీంతో ప్రజలకు సౌకర్యాల మాటేమో గానీ తీవ్ర ఇబ్బందులు మాత్రం ఎదుర్కొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మహిళా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. దీంతో బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరగడం, వారికి తగినట్లుగా ఆర్టీసీ అధికారులు బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. దీనికి తోడు ఆర్టీసీ అధికారులు అల్లాదుర్గం మండలంపై వివక్ష చూపుతూ ఇష్టానుసారంగా బస్సులను నడుపుతుండటం మండల ప్రజలకు శాపంగా మారింది.



హైవే నుంచి అల్లాదుర్గంకు సర్వీస్ రోడ్డు ఇదే

ఉన్న స్టాప్‌ను ఎత్తేస్తే ఎలా?

అల్లాదుర్గంలో పలు ప్రభుత్వ శాఖల డివిజన్ కార్యాలయాలు ఉండటం, పలు గ్రామాలకు కూడలిగా ఉండటంతో నిత్యం ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంగణం, ఐబీ చౌరస్తా జనంతో కిటకిటలాడుతుంది. 161వ జాతీయ రహదారి ఏర్పాటు కావడం, అల్లాదుర్గం వద్ద ఎగ్జిట్ ఏర్పాటు చేయకపోవడంతో ఇరు వైపులా 3 నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఎగ్జిట్ ఉండటంతో హైవే అధికారులు 5 కిలోమీటర్ల దూరం వరకు సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో కొన్ని ఆర్టీసీ బస్సులు ఈ సర్వీస్ రోడ్డు మీదుగా రాగా, మరికొన్ని బస్సులు హైవే రోడ్డుపై నుంచి అటే వెళ్తుండటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత ఆర్టీసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే నారాయణఖేడ్, హైదరాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు హైదరాబాద్-నారాయణఖేడ్ పట్టణాలకు వెళ్లేందుకు కొన్ని డీలక్స్ బస్సులను ఏర్పాటు చేయగా ఈ బస్సులు సర్వీస్ రోడ్డుపై నుంచి వెళ్తూ అల్లాదుర్గం వద్ద స్టాప్‌గా ఏర్పాటు చేశారు. దీంతో కొందరు ఉద్యోగులకు, ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. అయితే నారాయణఖేడ్ డిపో అధికారులు ఉన్నట్టుండి అల్లాదుర్గంలో స్టాప్‌ను తీసివేయడంతో ఈ బస్సులు కూడా హైవే రోడ్డు పై నుంచే వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు మొదలయ్యాయి. ఇదేమిటని డిపో మేనేజరును విచారిస్తే ఈ బస్సులకు అల్లాదుర్గంలో స్టాప్ తీసివేశామని చెబుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఇదే డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు మాత్రం నారాయణఖేడ్ నుంచి ఏపీలోని 450-500 కిలోమీటర్ల దూరంలోని ఒంగోలు, కందుకూరు పట్టణాలకు వెళ్లే బస్సుకు మాత్రం అల్లాదుర్గంలో స్టాప్ ఉంచడం, 100 కిలోమీటర్ల దూరంలోని హైదరాబాద్, లింగంపల్లి తదితర పట్టణాలకు డీలక్స్ బస్సులకు అల్లాదుర్గంలో స్టాప్‌ను తొలగించడం ఏమిటంటూ ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే తిప్పలే..

పలు గ్రామాలకు కూడలిగా ఉండి, పలు ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలున్నప్పటికీ అల్లాదుర్గం నుంచి జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణానికి వెళ్లేందుకు ఒక్క బస్‌ను కూడా ఏర్పాటు చేయకపోవడం ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. జహీరాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు జహీరాబాద్ నుంచి మెదక్ వెళ్లేందుకు ఉదయం ఓ బస్సును ఏర్పాటు చేశారు. కానీ ఈ బస్సు అల్లాదుర్గం పట్టణానికి రాకుండా 3 కిలోమీటర్ల దూరంలోని అల్లాదుర్గం ఐబీ చౌరస్తా నుంచే వెళ్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కేంద్రానికి వివిధ పనుల కోసం వెళ్లే అధికారులు, ప్రయాణికులు మెదక్ బస్సు కోసం అల్లాదుర్గం నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని బొడ్మట్‌పల్లి వెళ్లి మరో బస్సులో మెదక్‌కు వెళ్లాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులపై ఆర్టీసీ ఉన్నతస్థాయి అధికారులు, పాలకులు స్పందించి అల్లాదుర్గంలో నారాయణఖేడ్ డిపోకు చెందిన డీలక్స్ బస్సుకు స్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రమైన మెదక్‌కు వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గణపయ్యకు గ్రాండ్ వెల్‌కం



సదాశివపేటలో వినాయకచవితి సందడి పక్షం రోజుల ముందే వచ్చింది. యువత, భక్తులు భజన, ఆట పాటలతో భారీ వినాయక విగ్రహాన్ని ఆదివారం మండపానికి చేర్చి సందడి చేశారు. ఈ ఎదుర్కోలు కార్యక్రమం వినాయక చవితికి 15 రోజుల ముందే ఓ కార్పొరేట్ ఈవెంట్‌ను తలపించింది. వినాయకుడికి గ్రాండ్ వెల్‌కం పేరిట సంబురాలు నిర్వహించడం అందరినీ ఆకట్టుకుంది. భారీ సెట్టింగులతో, పెద్ద ఎత్తున బాణసంచా కాల్చుతూ, డీజేసౌండ్, ఆట పాటలతో వినాయకుడి విగ్రహానికి ఘన స్వాగతం పలికారు. దాదాపు రూ.2లక్షల వరకు వెచ్చించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు భక్తులు తెలిపారు. ఈ వేడుకలు పట్టణంలో 14వ వార్డులో జరిగాయి. అయితే ప్రతిష్ఠాపన కార్యక్రమం మాత్రం వినాయకచవితి రోజే నిర్వహిస్తారని పండితులు తెలిపారు.

- సదాశివపేట, ఆగస్టు 25

క్రీడాస్ఫూర్తితో పాల్గొనాలి



ఖేడ్‌లో కేపీరెడ్డి క్రికెట్ టోర్నీలో విజేతలకు బహుమతులు, చెక్కులను అందజేస్తున్న డీసీసీ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 25: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో క్రీడాపోటీల్లో పాల్గొనాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణఖేడ్‌లో కేపీరెడ్డి క్రికెట్‌టోర్నీ ముగింపు సందర్భంగా ఆదివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో మొదటి బహుమతి వెంకటాపూర్‌కు చెందిన వినయ్ డెకరేషన్ బృందానికి రూ.22,200 బహుమతిని చెక్కు రూపంలో అందించారు. రన్నర్‌గా రిస్కీటీం నిలువడంతో వారికి రూ.22000 లతోపాటు టోర్నీలో బెస్ట్‌ఎంపైర్‌గా జ్ఞానేశ్వర్, పవన్ తదితరులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో కేవీపీరెడ్డి, ఆకాష్‌రావుపాటిల్, దిలీప్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

అలరించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



కంది అక్షయపాత్రలో నిర్వహించిన వేడుకల్లో గోపికా శ్రీకృష్ణ వేషధారణలో చిన్నారులు



రామాయంపేట: మంజీరా విద్యాలయంలో కృష్ణుడి వేషధారణలో ఉట్టికొడుతున్న విద్యార్థులు

కంది, ఆగస్టు 25 : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌లో హరేకృష్ణ మందిరం వద్ద ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కీర్తనలు, మహాభిషేకం, ఉంజలసేవ, మంగళహారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. అక్షయపాత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకులు సత్యగౌరీచంద్రదాస మహాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు హరేకృష్ణ మూమెంట్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో హరేకృష్ణమూమెంట్ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

- రామాయంపేట, ఆగస్టు 25: పట్టణంలోని మంజీర విద్యాలయంలో శని, ఆదివారాల్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకలు చూపరులను అలరించాయి. పిల్లలు గోపికలు, శ్రీకృష్ణుడి విషధారణలు తోటి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు కృష్ణుడి ఉయ్యాల, లాలి పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, వాసవి, జితేందర్‌రెడ్డి పాల్గొని కృష్ణాష్టమి వేడుకల విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

జన్మాష్టమి సందర్భంగా

రావి ఆకుపై కృష్ణుడి చిత్రాలు



రాగి ఆకు, నెమలికపై రూపొందించిన కృష్ణుడి చిత్రాలు

నారాయణఖేడ్, ఆగస్టు 25: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ రావి ఆకుపై రూపొందించిన కృష్ణుడి చిత్రాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నెమలికలపై కూడా కృష్ణుడి చిత్రం వేసి పలువురి ప్రశంసలు పొందాడు.

బండ్లగూడలో ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ ఆలయంలో భక్తులతో కలిసి కార్పొరేటర్ పూజలు

పటాన్‌చెరు, ఆగస్టు 25: పటాన్‌చెరు డివిజన్ బండ్లగూడలో పోచమ్మబోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పోచమ్మ ఆలయాన్ని ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ మహిళలు అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలను సమర్పించారు. కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్, పలు పార్టీల నాయకులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

సమాజ హితమే వీహెచ్‌పీ లక్ష్యం



ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన కార్యదర్శి, వక్త గుమ్మాల సత్యం

మెదక్ అర్బన్, ఆగస్టు 25: హిందూ సమాజ హితమే వీహెచ్‌పీ లక్ష్యమని వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన కార్యదర్శి, వక్త గుమ్మాల సత్యం పేర్కొన్నారు. విశ్వ హిందూ పరిషత్ స్థాపించి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం సత్యసాయి మందిరంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 1964లో ఆర్ఎస్ఎస్ సెకండ్ చీఫ్ గురూజీ స్థాపించిన తమ సంఘం ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. శ్రీకృష్ణజన్మాష్టమి పురస్కరించుకొని సెప్టెంబర్ 1వరకు వీహెచ్‌పీ షష్టిపూర్తి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. హిందూ బంధువులందరినీ సంఘటితం చేసేందుకు సమ్మేళనాలు జరుపుతున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ బాధ్యులు మల్కాజి సత్యనారాయణ, మెంగని నారాయణ, శారద, మల్లేశం, ఆరేళ్ల అరవింద్‌గౌడ్, బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

కొండాపూర్, ఆగస్టు 25: మండలంలోని మారేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10 బ్యాచ్ పదవతరగతి విద్యార్థులు ఆదివారం మారేపల్లి సత్య ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు విద్యార్థులు పూలమాలలు వేసి సన్మానించారు. చాలాకాలం తర్వాత కలుసుకున్నందున పరస్పర క్షేమ సమాచారాలు తెలుసుకుంటూ గత స్మృతులను నెమరవేసుకున్నారు రోజంతా సాంస్కృతిక కార్యక్రమలతో సందడి చేసి, సహపంక్తి భోజనాలు చేశారు అంతకు ముందు ఒక ఉపాధ్యాయుడు, పూర్వ విద్యార్థి మృతికి సంతాపసూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేంద్రం, గీయాసోద్దీన్, వెంకటేశం, సుదర్శన్, బసప్ప, రమేష్, సురేందర్‌రావుతో పాటు 45మంది విద్యార్థులు పాల్గొన్నారు.

30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

నారాయణఖేడ్, ఆగస్టు 25: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీసాయిబాబా ఆలయంలో ఈ నెల 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. శ్రావణమాసం నాలుగవ వారం సందర్భంగా సాయిబాబ ఆలయంలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ వ్రతంలో పాల్గొనే భక్తులకు పూజా సామగ్రిని ఆలయకమిటీ తరఫునే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

'సీఎంఆర్ఎఫ్' చెక్కుల అందజేత

టేక్మాల్, ఆగస్టు 25: మండలంలో పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం టేక్మాల్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ. 19,92,500 మంజూరు కాగా, చెక్కులను పంపిణీ చేసినట్టు తెలిపారు. వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి ఆలయ వార్షికోత్సవానికి ఆహ్వానం

చేగుంట, ఆగస్టు 25: మండల కేంద్రంలో శ్రీమహంకాళి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం ఈ నెల 29 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఐదు రోజులు పాటు జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి ఆదివారం ఆహ్వానపత్రిక అందజేశారు. ఆహ్వానపత్రికను అందజేసినవారిలో ఆలయకమిటీ అధ్యక్షుడు ఉసికే శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్, కమిటీ సభ్యులు అయిత పరంజ్యోతి, చింతాల సిద్దిరాములు, సంగ్రుగు శ్రీకాంత్, బచ్చుల కృష్ణ, మద్దూరి రాజు ఉన్నారు .

కుల జనగణనపై నాన్చుతున్న ప్రభుత్వాలు

రామాయంపేట, ఆగస్టు 25: కుల, జనగణనపై నాన్చుడు ధోరణి పట్ల సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ ప్రభుత్వంపై ఆగ్రహం ప్రదర్శించారు. అందువల్ల తామే తమ కుల లెక్కలు తేలుస్తామంటూ ప్రకటించారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్న పేటలో కుల జనగణన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో దీన్ని చేపడతామన్న కాంగ్రెస్ ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలపై నమ్మకం లేకే తాము తమ కుల జనాభా సేకరించే పనిలో పడ్డామన్నారు. త్వరలోనే ఈ లెక్కలు తీసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో వెంకటయ్య, మర్కు దత్తు, సాయి గణేష్, జిల్లా అధ్యక్షుడు సందిల సాయిలు, వగ్గు శ్రీకాంత్, కృష్ణ ఉన్నారు.

మిరప పంటకు అంతుచిక్కని తెగులు

- రెండుకరాల్లో పంట నష్టం

గుమ్మడిదల, ఆగస్టు 25: ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఓ రైతు రెండు ఎకరాల్లో సాగు చేసుకున్న మిరప పంటకు అంతుచిక్కని తెగులు సోకడంతో చేతికొచ్చిన పంట కాస్త నేలపాలైంది. వేలాది రూపాయల మందులు కొనుగోలు చేసి పంటపై పిచికారి చేసినా తెగులు తగ్గకపోవడంతో మొత్తం పంట తెగులు బారినబడి పూర్తిగా నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన రైతు పోచుగారి మోహన్‌రెడ్డి కూరగాయల పండిస్తుంటాడు. ఈసారి తన రెండెకరాల పొలంలో ఎన్నో ఆశలతో మిరప పంట సాగు చేశాడు. మొదటి నుంచి రూ. వేలాదిగా మందుల కోసం ఖర్చు చేశాడు. పంట కూడా విరగకాసింది. అయితే చేతికొచ్చిన పంట మార్కెట్‌కు తరలించే సమయంలో అంతుచిక్కని తెగులు సోకి మిరపకాయలు టన్నుల కొద్ది కుప్పలుగా నేల రాలి కుళ్లిపోయాయి. దీంతో మంచి లాభాలు పొందవచ్చనే ఆ రైతు ఆశలు ఆవిరైపోయాయి. దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. శాస్త్రవేత్తలు చెప్పిన మందులు వాడినా తెగుళ్ల తగ్గలేదని, తనకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తెగులుతో నేల రాలిన మిరపకాయలు, కుళ్లిన మిరపకాయలను చూపుతున్న బాధిత రైతు

ఉత్తమ కరస్పాండెంట్‌ను సన్మానించిన ట్రస్మా



హైదరాబాద్‌లో వెంకటయ్యను సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

జహీరాబాద్, ఆగస్టు 25: జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభ ఉన్నత పాఠశాలకు చెందిన కరస్పాండెంట్ వెంకటయ్య గత 40 ఏళ్లుగా విద్యా రంగంలో ఉంటూ సేవలు అందిస్తున్నందుకుగాను రాష్ట్ర ట్రస్మా నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ట్రస్మా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మాణిక్‌ప్రభ ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న మరెల్లి వెంకటయ్యను ఉత్తమ కరస్పాండెంట్‌గా ప్రకటిస్తూ సన్మానించారు. తనకు ట్రస్మానాయకులు రాష్ట్రస్థాయి అవార్డును ఇవ్వడం పట్ల వెంకటయ్య సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల కోసం మరింత అంకిత భావంతో సేవచేస్తానని ఆయన స్పష్టం చేశారు. తనకు రాష్ట్రస్థాయి అవార్డు ఇచ్చిన నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్మానాయకులు శ్రీనివాస్‌రెడ్డి, క్రిష్టారెడ్డి, దశరథ్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిభావంతో మానసిక ప్రశాంతత

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, ఆగస్టు 25: భక్తిభావంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరూ భక్తి భావం అలవర్చుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వెల్దుర్తిలోని శ్రీరాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవం, శ్రీరాజరాజేశ్వరిదేవి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వెల్దుర్తిలో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముల్క శ్రీనివాస్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే మనేపల్లి గ్రామానికి చెందిన ఆశం పెంటయ్య, యశ్వంతరావుపేట గ్రామానికి చెందిన పెంటయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరి దేవి కళ్యాణం కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, నాయకులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వెల్దుర్తి:శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వీరభద్ర స్వామి ఆలయంలో పూజలు

గుమ్మడిదల, ఆగస్టు 25: మండలంలోని బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణ మాస పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో బొంతపల్లి వీరభద్ర స్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడ్డారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శశిధర్‌గుప్తా, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

రామాయంపేట, ఆగస్టు 25: పట్టణంలోని స్థానిక వాసవీమాత ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండురోజుల పాటు జరిగిన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఏటా వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఈ సారి కూడా ఏర్పాటైన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

కిష్టారెడ్డి ఆశయసాధనకు కృషి



కిష్టారెడ్డి వర్ధంతి సభలో మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, పక్కన ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్, ఆగస్టు 25: దివంగత ఎమ్మెల్యే పట్లోళ్ల కిష్టారెడ్డి ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ పేర్కొన్నారు. కిష్టారెడ్డి 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం నారాయణఖేడ్‌లోని మాఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సంస్మరణసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కిష్టారెడ్డి న్యాయవాదిగా, సర్పంచుగా, ఎమ్మెల్యేగా, నియోజకవర్గానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. పదవిలో ఉన్నసమయంలో చేసినఅభివృద్ధి పనులు, సేవలే ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్, కిష్టారెడ్డి తనయుడు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతరావు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్‌నాయకులు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్‌షెట్కార్, వైస్‌చైర్మన్ దారంశంకర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా దివంగత కిష్టారెడ్డి కుటుంబ సభ్యులు పంచగామలోని ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. కిష్టారెడ్డి సతీమణి గాలెమ్మ, కుమారులు ఎమ్మెల్యే సంజీవరెడ్డి, వెంకట్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, సోదరుడు విఠల్‌రెడ్డి, తదితరులు నివాళులర్పించారు. ఖేడ్‌లోని కిష్టారెడ్డి ఇంట్లో వారీకార్ భక్తుల ఆధ్వర్యంలో కీర్తన నిర్వహించారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్



మొక్క నాటి నీరు పోస్తున్న రవీంద్ర గౌడ్

జోగిపేట, ఆగస్టు 25: జోగిపేట లోని శాఖా గ్రంథాలయంలో లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ డా.రవీంద్రగౌడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ ఆకుల రాంబాబు, జోన్ చైర్మన్ తోట్ల రామకృష్ణ, స్థానిక అధ్యక్షుడు అల్లె శ్రీకాంత్, కోశాధికారి గడ్డమీది సంతోష్, సభ్యులు పీరగారి సంతోష్, మన్నె రాజు పాల్గొన్నారు.

చేగుంటలో పండ్లు పంపిణీ

చేగుంట, ఆగస్టు 25: చేగుంట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బుర్క నాగరాజు ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని ఆస్పత్రిలో రోగులకు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. నాగరాజు మాట్లాడుతూ ఏటా చేగుంట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజురాథోడ్

నారాయణఖేడ్, ఆగస్టు 25: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నాగల్‌గిద్ద మండలం మాజీ జడ్పీటీసీ రాజురాథోడ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం నారాయణఖేడ్‌లోని బీజేపీపార్టీ కార్యాలయంలో మండలపార్టీ అధ్యక్షుడు సిందోల్ దశరథ్, ఖేడ్‌పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్, మనూరు మండల అధ్యక్షులు ఈశ్వరప్ప, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంతోష్, బీజేపీనాయకులు పట్నం మాణిక్, సచిన్, రాజుపాటిల్, అశోక్, పవన్, భూంరాజ్ తదితరులు రాజురాథోడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ధర్మవిద్యార్థి విభాగం ఉపాధ్యక్షురాలిగా వర్షిత

నారాయణఖేడ్, ఆగస్టు 25 : ధర్మసమాజ్‌పార్టీ అనుబంధ ధర్మ విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా వర్షితను నియమిస్తూ ధర్మసమాజ్‌పార్టీ జిల్లా కార్యదర్శి అలిగే జీవన్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం ఆమెకు కండువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వర్షిత మాట్లాడుతూ అంబేడ్కర్, పూలే, కాన్షీరాం ఆశయసాధన కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. డాక్టర్ విశారదన్ మహారాజ్ నాయకత్వంలో విద్యార్థులకు, మహిళల సమస్యల పై పోరాటం కొనసాగిస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్‌లో సీపీఐ నాయకుడు మొహియుద్దీన్ వర్ధంతి



మొహియుద్దీన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

జహీరాబాద్, ఆగస్టు 25: సీపీఐ రాష్ట్రనాయకుడు మగ్దుం మొహియుద్దీన్ వర్ధంతిని ఆదివారం జహీరాబాద్ పట్టణంలో సీపీఐ డివిజన్‌కార్యదర్శి నర్సింహులు నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ కార్మికులు, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన గొప్ప మహనీయుడు మొహియుద్దీన్ అని కొనియాడారు. సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఉద్యమాల్లో పాల్గొని ప్రజాశ్రేయస్సుకోసం తన జీవితాన్ని అంకితం చేశాడని గుర్తు చేశారు. అతడి ఆశయసాధన దిశగా మనందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అజారోద్దీన్, అఫ్జల్, శంకర్, రాజు, తాజోద్దీన్, ఆశ్వాక్‌హుస్సేన్, సుధాకర్, విశ్వనాథ్, జహంగీర్, మొగులయ్య పాల్గొన్నారు.